31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
గురువారం,ఆగస్టు 13 ,2026 పేజీలు : 8

## ప్రజలకు వేగవంతమైన, సమర్ధవంతమైన సేవలు అందించాలి

- బ్లూకోల్ట్, పెట్రో కార్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి
- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 12 : ప్రజలకు పోలీస్ సేవలు మరింత వేగంగా, సమర్ధవంతంగా అందించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బందితో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్లూ కోల్ట్, పెట్రో కార్స్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, అత్యవసర స్పందన, నేర నియంత్రణ, నేరస్తులపై నిఘా, కమ్యూనిటీ పోలీసింగ్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హాట్స్పాట్ల వద్ద పెట్రోల్ వాహనాలను కొద్ది సేపు నిలిపి, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద -2లో

# అభివృద్ధి పనులను వేగవంతంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- క్షేత్రస్థాయిలో పనుల పురోగతి సంతృప్తికరంగా లేదు
- ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించాలి
- కాంట్రాక్టర్లు, అధికారులు పనుల్లో జాప్యం చేస్తే తగు చర్యలు... అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేయాలి
- రోళ్లవాగు షట్టర్ పనులు ఆగస్టు నెలాఖరులోగా, అక్కెపల్లి లిఫ్ట్ పనులు జనవరి 2027 నాటికి పూర్తి చేయాలి
- అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు అందించాలి.
- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 12: ధర్మపురి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్ర సాద్ తో కలిసి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పురోగతి ఏమాత్రం సంతృప్తికరంగా లేదని, ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించు కుని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులను అనవసరంగా జాప్యం చేయవద్దని, కాంట్రాక్టర్లు సహకరించకపోతే వెంటనే చర్యలు తీసుకుని అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేయాలని స్పష్టం చేశారు.మంజూరైన అన్ని పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని, రానున్న రోజుల్లో అభివృద్ధి పనుల్లో స్పష్టమైన మార్పు ప్రజలకు కనిపించాలని అన్నారు.సబ్ ప్లాన్ నిధులతో చేపట్టే రూ.5 లక్షల వరకు ఉన్న పనులను ఆలస్యం చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో వెంటనే ప్రారంభించాలని సూచించారు.ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ధర్మపురి పట్టణంలో చేపట్టాల్సిన పనులకు -2లో



### సీజనల్ వ్యాధులపట్ల

# అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్

చురకలు ప్రతినిధి, జగిత్యాల / సారంగాపూర్, ఆగస్టు 12: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించి, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని విద్యార్థులకు అనుకూలంగా ఉండే విధంగా కిచెన్ షెడ్ నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా నిర్మించాలని నిర్మాణ పనులలో ఎలాంటి -2లో

### కేసీఆర్ కట్టించిన

# డబుల్ బెడ్రూమ్ ఇళ్లకే ప్రారంభోత్సవాలు

- కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం చెప్పాలి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 12 : కమలాపూర్ లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లోనే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ లను పంచమని తన కోరానని, ఆ ఇళ్లను 20 కోట్లతో కేసీఆర్ నిర్మించాలని తెలిపారు. మౌలిక సదుపాయాల కోసం ఒక్కో ఇంటికి లక్ష రూపాయలు నాటి ప్రభుత్వమే కేటాయించిందని వివరించారు. మౌలిక సదుపాయాలు పూర్తి కాకముందే పొంగులేటి ఆఘమేఘాల మీద కమలాపూర్ కు వచ్చారని,ఆ ఇండ్లలో ఇంకా కనీస సదుపాయాలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ కట్టించిన ఇండ్లను కేసీఆర్ కట్టించారు అంటే మంత్రికి ఎందుకు కోపం వచ్చింది ? అని ప్రశ్నించారు. వారం రోజుల్లో లబ్ధిదారులు ఇండ్లలోకి వెళ్లలేక పోతే ప్రోసీడింగ్స్ రద్దు చేస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారని, ఇందిరమ్మ ఇళ్లకు లక్షా అరవై వేల చివరి ఇన్‌స్టాల్ మెంట్ డబ్బులు ఇంకా ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇంటికి పది లక్షలకు పైగా ఖర్చు అవుతుందని, ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షలు ఎలా సరిపోతాయని, చాలా -2లో

## నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకే అప్పగించాలి

- నీట్ విధానంపై విద్యార్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలి
- ప్రధాని మోడీకి మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ



చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 12: వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకే అప్పగించాలని దేశ ప్రధాని నరేంద్రమోడీ మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. నీట్ విధానంపై విద్యార్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కూడా దేశ ప్రధానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ప్రధానికి వ్రాసిన సుదీర్ఘ లేఖను పత్రికలకు విడుదల చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక వైద్య చికిత్సా విధానాలు దేశంలో అందుబాటులోకి వస్తున్నాయన్నారు. అదే సమయంలో వివిధ దేశాల్లో ప్రాణాంతక వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జనాభాకు అనుగుణంగా వైద్యుల సంఖ్యను పెంచాల్సిన అవసరం మరింత పెరిగిందన్నారు. వైద్య వృత్తిలోకి ప్రవేశించేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతుండటంతో పాటు, ప్రభుత్వాలు కూడా కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తూ వైద్య విద్యను ప్రోత్సహిస్తున్నాయన్నారు. గతంలో వైద్య విద్య ప్రవేశ పరీక్షలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించేవని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్ టి ఏ, ఆధ్వర్యంలో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు దేశవ్యాప్తంగా విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఒక రాష్ట్రంలో జరిగే అవకతవకల ప్రభావం దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులపై పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష విధానం అమలు చేయడం వల్ల ఆయా రాష్ట్రాల స్థానిక విద్యార్థులు తమ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వైద్య విద్యా అవకాశాలను పూర్తిస్థాయిలో -2లో

## రోడ్డు మైసమ్మ వద్ద మంత్రి అడ్లూరి పూజలు



**చురకలు విలేఖరి, వెల్గటూర్ ఆగస్ట్ 12 :** ఆషాడమాసం పురస్కరించుకొని వెల్గటూర్ నుంచి కరీంనగర్ వెళ్లే రాష్ట్ర రహదారిపై అంబారిపేట వద్ద బుధవారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ రోడ్డుమైసమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.గంతంలో ఇదే ప్రాంతంలో ఆయన కారు బోల్తాపడి స్వల్ప గాయాలతో బయటబడ్డ విషయం తెల్సిందే. ఈకార్యక్రమంలో మంత్రితోపాటు స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజలకు వేగవంతమైన, సమర్ధవంతమైన సేవలు అందించాలి

**మొదటి పేజీ తరువాయి...** వాహనాలు, కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డయల్ 112 కాల్స్కు తక్షణం స్పందించాలని, కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, డయల్ 112 లేదా ప్రజల నుంచి అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, బాధితులు మరియు సాక్షుల నుంచి సమాచారం సేకరించడం, సంఘటనా స్థలాన్ని భద్రపరచడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. బ్యాంకులు, ఏఎంటిల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రౌడీషీటర్లు, డిసిలు, కెడిలు, అనుమానితులు, ఆస్తి సంబంధిత నేరస్తులు, దొంగసొత్తు కొనుగోలు చేసే వ్యక్తులు, తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్కు ప్రాధాన్యత పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, రెసిడెంట్ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో తరచూ కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తులను సకాలంలో గుర్తించి, వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్ మరియు పెట్రోల్ కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి విలువైన ప్రాణాలను కాపాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిఆర్బి డిఎస్పి రవి కుమార్, బ్లూ కోల్ట్ పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల...

**మొదటి పేజీ తరువాయి...** వనిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపి సేవలు, ఐపీ సేవలు రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్ ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు మెరుగు పరచాలని డాక్టర్లు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో వర్షాకాలం వ్యాధుల పట్ల డెంగ్యూ, వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్స్పైర్ అయిన మెడిసిన్ ఉండకుండా చూసుకోవాలన్నారు. పేషంట్లను వైద్యులు అందిస్తున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని వున్న మంచినీటి సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎమ్మార్వో, ఎంపిడివో, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా

# నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి...** ముందుగానే ప్రణాళిక రూపొందించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోళ్ల వాగు షట్టర్ పనులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని, అక్కేపల్లి లిఫ్ట్ పనులను జనవరి 2027 నాటికి పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.పెండింగ్ బిల్లుల వివరాలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని, పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులకు సంబంధించిన నిర్వహణ పనులను సీజన్ ప్రారంభానికి ముందే ప్రణాళికాబద్ధంగా చేపట్టి పూర్తి చేయాలని సూచించారు.యశ్వంతరావు పేట, రంగధాంపల్లి చెరువుల పనులకు సంబంధించిన అంచనాలను త్వరగా ఆమోదించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, కన్నంపల్లి లింక్ కాలువకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ చెల్లింపులను త్వరలో పరిష్కరించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మపురిలో రూ.3.14 కోట్లతో అభివృద్ధి చేస్తున్న కోరండపల్లి చెరువు పనులు ప్రస్తుతం 35 శాతం పూర్తయ్యాయని, బండ్ ఏర్పాటు, స్టోన్ పిచింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పునరుద్ధరణ పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి వచ్చే జూన్ 2027 నాటికి చెరువును నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ధర్మపురిలో తొలి దశలో 2,756 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 2,462 ఇళ్లకు మార్కింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులను అధికారులు నిరంతరం సంప్రదించాలని, ఇల్లు నిర్మించేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన ఇతర లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధర్మపురిలో 617 ఇళ్ల పూర్తయ్యాయని, 1,295 ఇళ్లు ఫినిషింగ్ దశలో ఉన్నాయని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలపై కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలో ధర్మపురిని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని, ప్రతి గుడిసెకు ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో రూ.463 కోట్ల విలువైన 26 పనులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రూ.19 కోట్ల బిల్లులు చెల్లించగా, రూ.11 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. 10 పనులు పూర్తయ్యాయని, 12 పనులు పురోగతిలో ఉండగా, 2 పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించాలని, అవసరమైన చోట కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గత సంవత్సరం చేపట్టిన, ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.153 కోట్ల విలువైన 396 పనులు మంజూరు కాగా, రూ.31 కోట్ల విలువైన 96 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ.జీ.ఎస్, కింద రూ.18 కోట్ల విలువైన 296 పనులు మంజూరు కాగా ఇప్పటివరకు రూ.4.6 కోట్ల మేర ఖర్చు జరిగిందని, గ్రౌండింగ్ అయిన అన్ని పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురి పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.12.85 కోట్లతో 8 అభివృద్ధి పనులు చేపట్టగా 5 పనులు పూర్తయ్యాయని, మరో పని ఫినిషింగ్ దశలో ఉందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ టెండర్ దశలో ఉండగా, ప్రవేశ ద్వారాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ధర్మపురి పట్టణ తాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 కింద రూ.23 కోట్లతో చేపట్టిన పనుల్లో 22.2 కిలోమీటర్ల పైప్‌లైన్ లో 82 శాతం, 900 గృహ కనెక్షన్ల లో 77 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో మొత్తం 29 పనులకు రూ.234 కోట్ల విలువైన పనులు మంజూరు కాగా, ఇందులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలలు, మరమ్మతులు, భావిత కేంద్రాలకు సంబంధించిన 16 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ సమీక్షలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్. బి రాజ గౌడ్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంపిడిఓ లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకే అప్పగించాలి

**మొదటి పేజీ తరువాయి...** పొందలేకపోతున్నారనే ఆందోళన కూడా వ్యక్తమవుతోందన్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు ఈ అంశంపై మొదటి నుంచీ తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందేనని వెల్లడించారు.తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు అనుగుణంగా పలు ప్రాంతాల్లో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడంతో వైద్య విద్యకు అవకాశాలు గణనీయంగా పెరిగాయని, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వైద్య విద్య సీట్లలో స్థానిక విద్యార్థులకు రాష్ట్ర కోటా కింద లభించే అవకాశాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు చర్యలు చేపట్టడం, నిపుణులతో కమిటీలు ఏర్పాటు చేయడం, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి అక్రమాలను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం స్వాగతించదగిన పరిణామమేనని, అయితే దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష నిర్వహించడం వల్ల ఏదైనా సాంకేతిక లోపం, ప్రశ్నపత్రాల లీకేజీ లేదా నిర్వహణ వైఫల్యం చోటుచేసుకుంటే దాని ప్రభావం కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై పడే అవకాశం ఉందన్నారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు విద్యార్థుల్లో తీవ్ర మానసిక ఆందోళనకు కారణమవుతున్నాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఇలాంటి పరీక్షల విషయంలో ప్రభుత్వాలు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు.ఈ నేపథ్యంలో దేశంలోని ప్రతి రాష్ట్ర జనాభాకు అనుగుణంగా వైద్య కళాశాలలు, వైద్య విద్యా సీట్లను పెంచడంతోపాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పారదర్శకంగా వైద్య విద్య ప్రవేశ పరీక్షలను నిర్వహించే అవకాశం ఆయా రాష్ట్రాలకు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రస్తుత విధానాన్ని పునఃసమీక్షించి, అవసరమైన చట్టపరమైన సవరణలు చేపట్టడంతోపాటు, ఆయా రాష్ట్రాల పరిధిలో వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించే విధంగా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణలో పారదర్శకత,భద్రత,జవాబుదారీతనం పెంచడంతోపాటు, ప్రతి రాష్ట్రంలోని విద్యార్థులకు సముచిత అవకాశాలు లభించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని దేశ ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## కేసీఆర్ కట్టించిన...

**మొదటి పేజీ తరువాయి...** మంది లబ్ది దారులు పిటిషన్లు ఇవ్వడానికి వస్తే వాటిని మంత్రి పొంగులేటి తీసుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని అడిగితే మంత్రి పొంగులేటికి కోపం వచ్చిందని, ప్రజల పక్షాన మాట్లాడే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. పొంగులేటి రాజకీయ ప్రసంగం చేస్తూ అబద్దాలు చెప్తుంటే నేను వాస్తవాలతో అడ్డుకున్నానని, కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులపై అబద్దాలు వేదికపై చెప్పారని, కేంద్రం పార్లమెంటు లో ఇచ్చిన సమాధానాన్ని నేను గుర్తు చేశానని వివరించారు. మంత్రి పొంగులేటి బెదిరిస్తే బెదిరేది లేదని, ఎన్నికల హామీలపై నిలదీస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో హౌజింగ్ అంశం పై చర్చ పెడితే నేను అన్నిటి పై నిలదీస్తానని హెచ్చరించారు.

## మైనారిటీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ జాకీర్‌కు సన్మానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు,12 :** మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన అబ్దుల్ జాకీర్‌ను మంత్రి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా అబ్దుల్ జాకీర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి బాపూజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాజల రాజగోపాల్ రావు పాల్గొని అబ్దుల్ జాకీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి చేసిన సన్మానం తనపై మరింత బాధ్యతను పెంచిందని అబ్దుల్ జాకీర్ తెలిపారు. అందరి ఆశీస్సులు, సహకారంతో ముందుకు సాగుతూ మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## బీసీ ఎస్సీ ఎస్టీ ఐక్య వేధిక చైర్మన్‌గా అంజిరాజ్



**చురకలు విలేకరి,మల్లాపూర్,ఆగస్టు 12 :** మండలంలోని చిట్టాపూర్ గ్రామ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేధిక నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ గా దండుగుల అంజిరాజ్ వైస్ చైర్మన్ గా పబ్బతి కిరణ్, కోశాధికారిగా అరిసెల్ల మనోహర్ లను ఎన్నికవగా నూతన అధ్యక్షుడు తనపై నమ్మకంతో ఈ అవకాశాన్నిచ్చిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం, హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా వీరి ఎన్నికల పట్ల పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకుల సంపతి ఆశాలు, కడకుంట్ల సాయి, పోతుకంటి శ్రీనివాస్, బెజ్జారపు సుదర్శన్ నూతిపెల్లి మురళి, మైలారం అశోక్, మిర్యాల ప్రభాకర్, రాపర్తి నర్సయ్య, బోడ సురేంధర్, బల్సాని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ మహిళలకు సబ్సిడీ చెక్కుల పంపిణీ



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 12 :** మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద ధర్మపురి పట్టణ, మండల పరిధిలో ఎంపికైన 39 మంది మహిళలకు రూ. 19.50 లక్షల విలువైన 100 శాతం సబ్సిడీ చెక్కులను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ధర్మపురిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంత్రి చెక్కులను అందజేశారు. ఈ పథకం కింద ఒక్కో మహిళకు రూ. 50,000 చొప్పున 100 శాతం సబ్సిడీగా ఆర్థిక సహాయం అందించారు. మొత్తం 39 మంది లబ్ధిదారులకు రూ. 19.50 లక్షలు మంజూరయ్యాయి. పథకం ద్వారా వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథలు, నిరుపేదలు, ఒంటరి మహిళలకు ఆర్థిక చేయూత అందనుంది. ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను ఏర్పరుచుకుని ఆర్థికంగా ఎదగాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లబ్ధిదారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ మామిల్ల శ్రీనివాస్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కొనుగోళ్లకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్

**-గురువారం నుంచి కొత్త విధానం అమలు**
**-రైతులు యాప్ ద్వారానే ఎరువులు బుక్ చేసుకోవాలి**
**- మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్‌కుమార్**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (12) :** ఎరువుల కొనుగోళ్లలో పారదర్శకత,సులభతరం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్‌ను రైతులు తప్పనిసరిగా వినియోగించాలని ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్‌కుమార్ బుధవారం సూచించారు. ప్రస్తుతం యూరియా బుకింగ్ కోసం ఉపయోగిస్తున్న యాప్ బుధవారం వరకు మాత్రమే పనిచేస్తుందని, గురువారం నుంచి అన్ని రకాల ఎరువుల విక్రయాలు బుకింగ్‌లు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే నిర్వహించబడతాయన్నారు. మండలంలోని రైతులు ప్రస్తుతం వినియోగిస్తున్న యూరియా బుకింగ్ యాప్ ద్వారా ఇప్పటివరకు 28,635 యూరియా బస్తాలను విజయవంతంగా కొనుగోలు చేసినట్లు ఆయన పెర్కొన్నారు. కొత్త ఎఫ్ఎఫ్ఎస్ విధానంలో రైతులు ముందుగా ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ,అనంతరం ఆధార్ నంబర్ లేదా ఫార్మర్ ఐడీ ద్వారా యాప్‌లో లాగిన్ అయి, సర్వే నంబర్ వారీగా పంట వివరాలను నమోదు చేయాలన్నారు. రైతులు తమకు అవసరమైన ఎరువుల రకం, పరిమాణం, కొనుగోలు చేయదలిచిన డీలర్‌ను ఎంపిక చేసుకుని యాప్‌లో బుకింగ్ చేసుకోవచ్చన్నారు. బుకింగ్ పూర్తయిన తర్వాత యాప్‌లో వచ్చే క్యూఆర్ కోడ్ను సంబంధిత ఎరువుల డీలర్‌కు చూపించి ఎరువులను పొందవచ్చని సుచించారు. ఈ విధానం ద్వారా రైతులకు ఎరువుల లభ్యతపై స్పష్టత ఉండటంతో పాటు, అక్రమాలు, దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. ఎరువుల కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని, రైతులందరూ కొత్త ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని సకాలంలో ఎరువులు బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**-తహశీల్దార్ వరప్రసాద్ వినతిపత్రం సమర్పించిన ఉపాధ్యాయ సంఘనాయకులు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (12) :** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు టియస్ యుటియఫ్ ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల తహసీల్దార్ వరప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ డిమాండ్లను ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లారు .ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన ఐదు కరువు భత్యం డీఏ వాయిదాలను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్ లో ఉన్న పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించి విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టియస్ యు టి యఫ్ జిల్లా కార్యదర్శి గాదె శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు డి. శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి టి. ఇమ్మాన్యూల్, కార్యదర్శులు ఎస్. మమత,ఎం.స్వామి,టి.త్రినాథ్, కె. నరేందర్,ప్రభాకర్, రాజేందర్, ఎంఆర్సీ సిబ్బంది రవీందర్,శివ, కార్తీక్,కేజీబీవీ ఉపాధ్యాయులు శారద,అరుణ, మాధురి ,సరిత,రాధిక,సుమలత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## చెరుకు ఫ్యాక్టరీ వెంటనే తెరిపించాలి



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 12 :** రైతులకు రవాణా చార్జీలు చెల్లించాలి రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిసి చెరుకు రైతుల సమస్యలను వివరించారు. ఇటీవల కోరుట్ల నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జగిత్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఘజంగి నందయ్యతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమం అమలుతీరును పరిశీలించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలతో నిర్వహించిన పునఃశ్చరణ కార్యక్రమంలో స్థానిక చెరుకు రైతులు తమ సమస్యలను జువ్వాడి కృష్ణారావు దృష్టికి తీసుకువచ్చారు.. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి రైతుల సమస్యల ను వివరించిన కృష్ణారావు,ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు చేస్తున్న రైతులు తమ పంటను దూరంగా ఉన్న కామారెడ్డి ఫ్యాక్టరీకి తరలించాల్సి రావడంతో రవాణా ఖర్చులు తీవ్ర భారంగా మారాయని తెలిపారు. అంతేకాకుండా చెరుకు రవాణాలో ఆలస్యం కారణంగా చక్కెర రికవరీ శాతం కూడా తగ్గుతోందని పేర్కొన్నారు. కాబట్టి రైతులకు టన్నుకు రూ. 400రవాణా చార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని,అలాగే ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జువ్వాడి కృష్ణారావు మంత్రిని కోరారు. ఈ సమస్యలపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి పరిస్థితిని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జువ్వాడికృష్ణారావు తెలిపారు.

## హామీలు అమలు చేయాలి



**-పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్**

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 12 :** ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కోరుట్ల డివిజన్ కేంద్రంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయిసమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఒక్క పైసా కూడా ప్రభుత్వంపై అదనపు భారం పడని డిమాండ్లను సైతం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు . ఆగస్టు నెలాఖరులోగా పీఆర్సీని ప్రకటించాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, నూతన హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు పెన్షనర్ల అన్ని డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సి. హన్మంత్‌రెడ్డి, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం,కోశాధికారి ఎన్. లక్ష్మీనారాయణ,ఉపాధ్యక్షుడు ఎం.డి. సైఫోద్దీన్‌తో పాటు కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామదేవతలకు జలాభిషేకం



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఆగస్టు 12 :** మండలంలోని కుస్తాపూర్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ప్రత్యేకపూజలు, గోదావని నది జలాలతో జలాభిషేకం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికొకరు చొప్పున మొగిలిపేట గోదావరి నదిలో పుణ్యస్నానమాచరించి గోదావరి జలాలతో బిందెలను నెత్తినెత్తుకొని కాలినడకన కుస్తాపూర్ గ్రామశివారులోని ఆలయంలో ప్రత్యేకపూజలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెల్ల రాజేశ్వర్,ఉపసర్పంచ్ సరికెల మహిపాల్,వార్డు సభ్యులు ఆయా కులసంఘాలసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఆగస్టు (12) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి  చెక్కులను బుధవారం గ్రామ సర్పంచ్ తరి రామనుజం, కాంగ్రెస్ డీసీసీ మాజీ జిల్లా కార్యదర్శి పెంట లింబద్రి లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనంతరం మాట్లాడుతూ,ఆపదలో ఉన్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బెల్లాల లౌక్య, బెల్లాల రాజ్‌కుమార్, కొత్తురి సుధాకర్, లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహభావం ఐక్యత పెరుగుతుంది



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 12 :** క్రీడలు ఆడటం వల్ల స్నేహభావం ఐక్యత పెరుగుతాయని కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం ఆయన జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. కేవలం పోటీల సమయంలోనే కాకుండా క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు పరస్పర స్నేహభావం ఐక్యత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రణయ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, క్రీడా కార్యదర్శి నీరటి రమణతో పాటు న్యాయవాదులు వడ్డేపల్లి శ్రీనివాసన్, కంతి మోహన్ రెడ్డి, పుప్పాల రాంభూపాల్, పోలకొండ దయాకర్ వర్మ, గడ్డం శంకర్ రెడ్డి, బోడ లక్ష్మణ్, ఒజ్జెల శ్రీనివాస్, అలుముల రాంబాబు, తెడ్డు ఆనంద్, ద్యావని సత్యనారాయణ, చింతకుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం జరిగేలా కృషి చేస్తా

### -మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 12:** ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలని, ఈ అంశాన్ని రానున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సంఘం ప్రతినిధులు మంత్రిని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫీల్డ్ స్థాయిలో కీలకంగా పనిచేస్తున్న తమకు పే స్కేల్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు.వారి సమస్యలను క్యాబినెట్‌లో చర్చించి ముఖ్యమంత్రి  దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అన్ని విధాలా న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై తన లెటర్ ప్యాడ్‌పై ముఖ్యమంత్రి కి, పంచాయతీరాజ్ శాఖ మంత్రికి, పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రత్యేకం గా లేఖలు రాస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు గడ్డం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం రాజా గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు గౌడికర్ శ్రీనివాస్, గోనెపల్లి మహేష్, సాతర్ల బాలరాజ్, మార్కాపురం అశోక్, మామిడి అనిత, మల్లేశం రవి, సుజాత, శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రకాష్, భీమన్నతో పాటు అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో నూతన విధానం

### -పంటసాగు వివరాలు యాప్ ద్వారా ముందే నమోదు



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్, 12 :** ఆగస్టు 13 నుండి "ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ ఎఫ్ఎఫ్ఎస్ నూతన యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణి చేయడం జరుగు తుందని వెల్గటూర్ మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ తెలిపారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా, సులభ తరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నూతన డిజిటల్ విధానం అమలు తీసుకు వచ్చిందని దీనిలో భాగంగా వెల్గటూర్ మండల రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా ఈ యాప్ ద్వారానే జరుగు తుందని ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా, ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందు గానే యాప్ ద్వారా నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవా లన్నారు. రైతు వివరాలు, సాగు భూమి,పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగు తుంది.రైతులు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎరువులు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ నూతన విధానం ద్వారా రైతుల వివరాలు, సాగు భూమి, సాగు పంట ఆధారంగా ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం సులభం ఆవు తుందని, ఎరువుల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా సాగేందుకు అవకాశంఉందని, వెల్గ టూర్ మండలంలోని రైతులందరూ ఎరువుల అవసరం వచ్చిన తర్వాత కాకుండా,ముందుగానే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, రైతులు ఐడి, ఆధార్, మొబైల్ నంబర్, భూమి వివరాలు సిద్ధంగా ఉంచుకొని నమోదు పూర్తి చేసుకోవాలని ఎంఏఓ సూచించారు. రైతులు యాప్ వినియోగంలో సందే హాలు, నమోదు ఇబ్బందులుఉంటే గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి, ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

### సమాజ సేవలో

## యువత భాగస్వామ్యం కావాలి



చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 12: సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో లయన్స్ క్లబ్ సభ్యులు పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను పరిశు భ్రపరచారు.సమాజ సేవలో యువతను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నాము అన్నారు.అనంతరం గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయానికి కాంపిటేటివ్,పఠన పుస్తకాలను అందించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్,దాసరి గంగాధర్,బొడ్గం అంజిరెడ్డి, బొమ్మకంటి నవీన్,ఆడెపు రాం ప్రసాద్,గంట్యాల ప్రవీణ్,పులి రమేష్,గ్రంథాలయ నిర్వాహకులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

### కొండగట్టు ఆంజనేయస్వామి

## హుండీ ఆదాయం రూ.1.62 కోట్లు



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 12 :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించారు.దేవస్థానం కార్యనిర్వహణాధికారి,ఉపకమిషనర్ శ్రీ ఎస్.అంజనారెడ్డి ఆధ్వర్యంలో 80 రోజుల అనంతరం 13 హుండీలను విప్పిలెక్కించగామొత్తంరూ.1,62,16,62 1 నగదు ఆదాయం లభించింది. హుండీలలో లభించిన బంగారం, వెండిని ప్రత్యేకంగా లెక్కించి భద్ర పరిచారు.అలాగే వివిధ దేశాలకు చెందిన 133 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియను దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ అధికారులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ గుండి హరిప్రసాద్, సూపరిం టెండెంట్ సునీల్‌కుమార్, ప్రధాన అర్చకులు డా. జితేంద్ర ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది, దేవాదాయ శాఖ అధికారులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# “గూడూరి”ని కాంగ్రెస్ నుండి బహిష్కరించండి

**-హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల ధర్నా**

**-తహసీల్దార్‌కు వినతి పత్రం పాత్రికేయుల ఇళ్ల స్థలాలపై కేసును విరమించుకోండి**




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 12 :** హుజురాబాద్‌లో పాత్రికేయుల నివేశన స్థలాలపై కోర్టుకు వెళ్లి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని హుజూరాబాద్ ప్రెస్ క్లబ్,ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గంటపాటు నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జక్కని నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ?ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామని రవీందర్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీ క్యాంప్‌లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని తెలిపారు.జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఉత్తర్వుల మేరకు మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించగా,జర్నలిస్టులు లక్షలాది రూపాయలు వెచ్చించి గృహాలు నిర్మించుకున్నారని తెలిపారు. హుజూరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు రాజేశ్వరి భర్త, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గూడూరు అంజలి మామ అయిన కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి అక్కసుతో కోర్టులో కేసు వేశారని మండిపడ్డారు.మూడేళ్లుగా ఆ కేసును ఉపసంహరించుకోకుండా జర్నలిస్టులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**నెరవేరని హామీలు**

హుజురాబాద్‌లో పాత్రికేయుల నివేశన స్థలాల సమస్యపై రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబులకు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారం లభించలేదని పాత్రికేయులు వాపోయారు. కేసు విత్‌డ్రా చేయిస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబు హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. గూడూరు స్వామిరెడ్డి తన నిరంకుశ వైఖరిని వీడి వెంటనే కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని,లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు చందుపట్ల జనార్ధన్, వేల్పుల రత్నం, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, దేవసాని ప్రియదర్శిని, సృజన, సందెల వెంకన్నలతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు. తమ పోరాటానికి సంఘీభావం ప్రకటించిన ప్రజాసంఘాల నేతలకు ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామణి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# హత్యాయత్నం కేసులో ఒకరు అరెస్ట్ - జ్యూడిషియల్ రిమాండ్

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం, వెంకటాపూర్ గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ నివాస సముదాయంలో ఉండే చింతల సత్యనారాయణకు, అదే గ్రామానికి చెందిన కడమంచి శ్రీనుతో గతంలో



గొడవ జరిగింది. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న శ్రీను, ఆగస్టు 10న సత్యనారాయణ గ్రామంలోని కల్లు కాంపౌండ్ వద్ద ఉన్నాడని తెలుసుకుని, గొడ్డలి తీసుకుని అక్కడికి వెళ్లాడు.అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహించిన శ్రీను తన వెంట తీసుకువచ్చిన గొడ్డలితో సత్యనారాయణ తలపై దాడి చేసి, అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.ఈ ఘటనపై ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ ఓ. వెంకటేష్ దర్యాప్తు చేపట్టి, సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడు కడమంచి శ్రీనును అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా గౌరవ మెజిస్ట్రేట్ నిందితుడికి జ్యూడిషియల్ రిమాండ్ విధించారు.పోలీసుల సమాచారం ప్రకారం, కడమంచి శ్రీనుపై గతంలో ఒక హత్య కేసు నమోదై ఉండగా, ఆ కేసులో జైలు శిక్ష అనుభవించి ఇటీవల విడుదలైనట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ కేసులో పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పాత కూరగాయల మార్కెటే ముద్దు

**-పాత కూరగాయల మార్కెట్ లోనే మార్కెట్ నడపండి**

**-వ్యాపారులు నష్టపోతున్నా పట్టించుకోరా?**

**-హుజురాబాద్లో దుకాణాలు బంద్, వ్యాపారుల ర్యాలీ**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 12 :** హుజురాబాద్ పట్టణం లోని పాత మార్కెట్‌స్థలంలో మార్కెట్‌ను నిర్వహించాలని కోరుతూ బుధవారం వ్యాపారస్తులు బంద్ నిర్వహించారు. 27వ వార్డ్ కౌన్సిలర్ కోయల్ కార్ భారతి ఆధ్వర్యంలో వ్యాపారులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.“రోడ్లమీద బజారు.. బతుకులు బేజారు” “మన మార్కెట్.. మనకే కావాలి”అంటూ నినాదాలు చేశారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ బి కిషన్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ... ఎన్నో ఏళు ్లగా పాత మార్కెట్ నడుస్తోందని, దాన్ని కళావిహీనం చేశారని ఆరోపించారు. మార్కెట్ నడిస్తే దుకాణాలన్నీ కళకళ లాడేవని గుర్తు చేసుకున్నారు. గురువారం అంగడికి వేలాదిమంది వచ్చేవారని,లక్షలాది రూపాయల టర్నోవర్ జరిగిందని,ఉన్న వ్యాపారుల కడుపు నిండేదని అన్నారు.మార్కెటింగ్ శాఖ రూ.1.26 కోట్లతో నిర్మించిన రైతుబజార్ మూడేళ్లుగా నిరుపయోగం గా ఉందన్నారు.పాత మార్కెట్ స్థలంలో నిర్మించిన కొత్త మార్కెట్‌ను నిర్వహించా లని డిమాండ్ చేశారు. మార్కెట్ను ఇప్పటికీ ప్రారంభించకపోవడం దారుణమని, మార్కెట్ నడవక ఇటువైపు ప్రజలు,వినియోగదారులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యాపారాలు సరిగా నడవక జరగక తీవ్రంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కొందరు మారు బేరం చేసే వ్యాపారుల ప్రయోజనం కోసమే మార్కెట్ను మున్సిపల్ ప్రాంతంలో నడుపుతున్నారని ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాత మార్కెట్ స్థలంలోకి మార్కెట్ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.30 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి తీర్మానం చేసినప్పటికీ మార్కెట్ ను పాత స్థలంలో ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు.పెట్టుబడి పెట్టి వ్యాపారాలు నడవక తీవ్ర అప్పుల్లో ఉన్నామని,ప్రతాప వాడ,రజక వాడ, పోచమ్మ వాడ,యాదవ వీధి, కుమ్మరి వాడ ప్రజలకు పాత మార్కెట్ స్థలంలో మార్కెట్ నిర్వహించడం వల్ల ప్రయో జనం కలుగుతుందన్నారు. అధికారులు ప్రజల, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాత మార్కెట్ ఉన్న స్థలంలోనే మార్కెట్ను నిర్వహించాలని, వ్యాపారులకు సైతం సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కోయల్ కార్ బాలాజీ,మాజీ వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కోయల్ కార్ సమన్, మార్కండేయ క్యాస రమేష్,బల్లు పున్నశీ చందర్, భాస్కర్ కొమురవెల్లి సంతోష్ ఇసాక్, రాజు అశోక్, ప్రకాష్,సంపత్,అనిల్, తిరుపతి,శ్రావణ్ పాల్గొన్నారు.

## మంత్రి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 12 :** రాష్ట్రక్రీడా మత్స్యశాఖ మంత్రివర్యులు వాకిటీ శ్రీహారిత్వరగా కోలుకోవాలని అక్కపల్లి ముదిరాజ్ సంగం ఆద్వర్యంలో సంఘం ప్రతినిధులు బుధవారం పెద్దమ్మ తల్లికి ప్రత్యేకపూజలు చేసి వేడుకున్నారు.ఇటీవల ముదిరాజ్ సంఘానికి చెందిన ముద్దుబిడ్డ రాష్ట్ర క్రీడా  మత్స్యశాఖ మంత్రివర్యులు వాకిటీ శ్రీహారి అనారోగ్యానికి గురి అయ్యారని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున వారు త్వరగా కోలుకోవాలని అక్కపల్లి ముదిరాజ్ సంఘానికి చెందిన గుమ్మడి బాలకృష్ణ ముదిరాజ్,నాంపెల్లి ముదిరాజ్ పిట్ల మోహాన్,జెట్టి తిరుపతి ముదిరాజ్ దుండిగళ్ళ బాలయ్య మూదిరాజ్ పండుగ అంజయ్య ముదిరాజ్ పండగబాబు ముదిరాజ్‌లు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు,

## శ్రీవారాహిసహిత ఉన్మత్త భైరవ ఆలయం లో వైభవంగా ఆషాఢ అమావాస్య పూజలు

**-కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణ**

**-భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రసాదాలు స్వీకరించిన భక్తులు**



**చురకలు ప్రతినిధి,హనుమకొండ ఆగస్టు 12 :** ఆషాఢ మాస ముగింపు అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకుని, మారుతీల్స్ కాలనీలోని శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయంలో పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో, జనసందోహంతో కిటకిటలాడింది.ఆషాఢ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వారాహి అమ్మవారికి, ఉన్మత్త భైరవ స్వామివారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, దివ్యమైన అలంకరణలు మరియు విశేష పూజలు జరిపారు. భక్తులు వేకువజామున నుంచే క్యూలైన్లలో నిలబడి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.సమస్త జనులకు ఆయురారోగ్యాలు కలగాలి: ఆలయ అర్చకులు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ వీరభద్ర నాథ్ గారు మాట్లాడుతూ... “ఆషాఢ అమావాస్యకు ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత ఉంది. అమ్మవారి దివ్య అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలి. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ సమస్త ప్రజానీకానికి ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం” అని పేర్కొన్నారు.ఘనంగా అన్నదాన కార్యక్రమం పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ ఆలయ ప్రాంగణంలో భారీగా అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు మరియు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**-ఆలయ చిరునామా,**
**శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయం**
**మారుతీల్స్ కాలనీ, న్యూ శాంపేట సర్కిల్,**
**కెరియర్ పాయింట్ కాలేజ్ వెనుక వైపు, చాకిరేవు గుట్ట.**
**ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.**

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగష్టు 12 :** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజకవర్గంలోని ఎల్లారెడ్డిపేట మండల రహన్‌పేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్ సోదరుడు నమిలికొండ దేవరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్‌ను ఓదార్చి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, "నేనున్నా.. ధైర్యంగా ఉండండి" అంటూ భరోసా కల్పించారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగష్టు 12 :** ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా సాధికారిక మహిళ కోఆర్డినేటర్ దయ అరుణ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని చమనపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ రేవతి నాగరాజు ఆధ్వర్యంలో గ్రామభివృద్ధి కొరకై లేబర్ కార్డు డ్రైవ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ ఆఫీసర్ రఫీ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ లు లేబర్ కార్డు యొక్క ముఖ్య ఉద్దేశం, శిశు మరియు మహిళా అభివృద్ధి కార్యక్రమాల గురించి, టోల్ ఫ్రీ నెంబర్లు- 112, 1098, 181, 14567, 155326, ఉన్నత విద్య మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్నటువంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీమతి కవిత, సతీష్ రెడ్డి, హారిక, రవళి, కిరణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీ ప్రశాంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ సాధించడమే లక్ష్యం

**-సెప్టెంబర్ 1న 51 వేల మంది ఉపాధ్యాయులతో మహాధర్నా:**

**-జిల్లా పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనంద్‌రావు**



**రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్**

ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపుతూ 51 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనంద్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 1న రాష్ట్ర రాజధానిలో సుమారు 51 వేల మంది ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహించనున్నామని, ఈ మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ధర్మపురి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటమే మార్గమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని , వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తి పెరిగిందని ఆనంద్‌రావు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి పరస్పర సంబంధం కలిగిన అంశాలని, పాఠశాలల్లో బోధనా వాతా వరణం మెరుగుపడాలంటే ఉపాధ్యా యుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. గత పాలకుల అనుభవాల నుంచి ప్రస్తుత ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ప్రధాన డిమాండ్లలో ఒకటైన పీఆర్సీపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమని ఆయన అన్నారు. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఉద్యోగుల వేతనాలను సవరించాల్సిన అవసరం ఉందని, పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ఇకపై కాలయాపన చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. పీఆర్సీ కేవలం వేతన సవరణకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఉద్యోగుల ఆర్థిక భద్రత, కుటుంబ సంక్షేమం, భవిష్యత్తు అవసరాలతో ముడిపడిన కీలక అంశమని ఆయన వివరించారు. ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లలో 51 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ అమలు అత్యంత ముఖ్యమైనదని ఆనంద్‌రావు తెలిపారు. దీనితోపాటు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ అనంతర జీవితానికి భరోసా కల్పించే పెన్షన్ వ్యవస్థ ఉద్యోగులకు అత్యంత కీలకమని, ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి పదోన్నతులు, బదిలీలు, ఇతర ఉద్యోగపరమైన అంశాల్లో నెలకొన్న అనిశ్చితికి తెరదించాలని అన్నారు. మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. మహిళా ఉపాధ్యాయులకు 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ఉద్యోగ బాధ్యతలతోపాటు కుటుంబ బాధ్యతలను సమన్వయం చేసుకునే అవకాశం కల్పించాలని అన్నారు. 317 జీవోకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, దాని ప్రభావం తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల స్థానికత, కుటుంబ పరిస్థితులు, ఉద్యోగ భద్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 317జీవో సమస్యకు మాన వీయ దృక్పథంతో పరిష్కారం చూపా లని సూచించారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించిన జాబ్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఆనంద్‌రావు కోరారు. ఖాళీ పోస్టుల కారణంగా ఇప్పటికే పనిచేస్తున్న సిబ్బందిపై అదనపు పనిభారం పడు తోందని, దీని ప్రభావం కార్యాల యాల పనితీరుతోపాటు పాఠశాలల్లో విద్యా బోధనపై కూడా పడే అవకాశం ఉందని అన్నారు. ఖాళీలను భర్తీ చేయడం, అవసరమైన చోట జాబ్ చార్జీలు విడుదల చేయడం ద్వారా పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కొక్కటిగా విడివిడిగా పరిష్కరించాల్సిన అంశాలు కావని, మొత్తం ఉద్యోగ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆనంద్‌రావు పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఆర్థిక భద్రత, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సెలవుల సౌకర్యం, సర్వీస్ రూల్స్, పెన్షన్ వంటి అంశాల్లో స్పష్టత ఉంటేనే వారు మరింత ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించగలరని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం ద్వారా విద్యారంగానికి మేలు జరగదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మహాధర్నాను కీలకమైన ఉద్యమ కార్యాచరణగా పీఆర్టీయూటీఎస్ భావిస్తోందని ఆయన తెలిపారు. సుమారు 51 వేల మంది ఉపాధ్యాయులను సమీకరించి రాష్ట్ర రాజధానిలో నిర్వహించనున్న ఈ మహాధర్నా ద్వారా ప్రభుత్వం దృష్టిని ఉపాధ్యాయుల సమస్యలపై కేంద్రీ కరించనున్నామని చెప్పారు. మహాధర్నా విజయవంతం కావడం కేవలం ఒక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కాదని, ఉపాధ్యాయుల ఐక్యతను, సంఘటిత శక్తిని ప్రభుత్వానికి తెలియజేయడమేనని అన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ధర్మపురి మండల పీఆర్టీయూటీ ఎస్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమానికి మండల శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సెప్టెంబర్ 1మహాధర్నాకు మండలం లోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా సమన్వయంతో పని చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ధర్మపురి మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన పర్యటన సందర్భంగా ఉపాధ్యాయులు తమ సమస్యలను జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు సంఘంలో చేరారు. ఉపాధ్యాయుల సమస్యలపై సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని, సమస్యల పరిష్కారం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర బాధ్యులు గణేష్, శివప్రసాద్, మండల బాధ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను తొలగించాలి

**-వినోద్‌కుమార్, గంగుల డిమాండ్**

**చురకలు ప్రతినిధి కరీంనగర్, ఆగస్టు 12 :** ఈనెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు 18వ సమావేశ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను వెంటనే తొలగించాలని మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ నగరంలోని గంగుల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనే నీళ్ల కోసం జరిగిన పోరాటమని, కేసీఆర్ హయాంలో అన్ని చట్టబద్ధమైన అనుమతులతోనే ప్రాజెక్టులను నిర్మించినట్లు స్పష్టం చేశారు. తెలంగాణలోని 7 ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి ఎజెండా పంపడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏ విధంగా స్పందిస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరడం, దాన్ని ఎజెండాలో పెట్టడం సరికాదన్నారు. ?తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భాజపా, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడుగుతుంటే ఎంపీలు మౌనం వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే ఎంపీలందరూ దిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి, జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ఆ ప్రాజెక్టుల తొలగింపునకు పార్లమెంట్ వేదికగా గట్టిగా కొట్లాడాలని సూచించారు. ఒకవేళ అనుమతులు రద్దు చేస్తే రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. ?ఈనెల 18లోగా ప్రాజెక్టులను జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తొలగించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రమైన ఆందోళనలు చేపడతామని నేతలు



హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తో పాటు, మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, బారసా నాయకులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాలు చైతన్య కేంద్రాలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (ముస్త్యాల,) ఆగస్టు 12:** రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో డా. బీఆర్ అంబేద్కర్, కొమురం భీమ్, జ్యోతిరావు పూలే, కాన్సిరాం బిర్సా ముండా పెరియార్ భగత్ సింగ్ జగ్జీవన్ రామ్ బత్తిని మొగిలయ్య గౌడ్ అష్ఫా ఖుల్లా ఖాన్ సాకలి ఐలమ్మ ఝాన్సీ లక్ష్మీబాయి సావిత్రిబాయి పూలే, ఛత్రపతి షాహు మహారాజ్ తదితర మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య--నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య మాట్లాడుతూ దళిత, బహుజనుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు.సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్వల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు అలంకరణ కోసం కాకుండా సమాజ ఆత్మగౌరవం, చరిత్రకు ప్రతీకలుగా నిలిచే చైతన్య కేంద్రాలని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ విలువలు, పూలే దంపతుల విద్యా స్ఫూర్తి, కొమురం భీమ్ జల్--జంగల్--జమీన్ హక్కుల స్ఫూర్తిని యువత ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైసా రాజయ్య మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. స్థానిక మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ,కలెక్టర్ తో పాటు సింగరేణి ఆర్ జి 1 జి ఎం పోలీస్ అధికారులు చొరవ తీసుకుని అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, నాయకులు బూడిద సమ్మయ్య, సురేష్, వెంకటేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### హుజురాబాద్‌లో ఘనంగా

# 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ ఆగస్టు 12 :** హుజురాబాద్ పట్టణంలో దేశభక్తిని చాటేలా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని బుధవారం బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా వీధుల గుండా ద్విచక్ర వాహనాలపై త్రివర్ణ పతాకాలను పట్టుకొని నినాదాలు చేస్తూ తిరిగారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశభక్తి భావనను పెంపొందించడానికి, ప్రజల్లో జాతీయ ఐక్యతను చాటడానికే ప్రతి ఏడాది ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని బిజెపి ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా అభియాన్ అభియాన్ పేరిట ప్రోగ్రాం నిర్వహిస్తుందని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపు నిచ్చారు. త్రివర్ణ పతాకం మన జాతీయ గౌరవానికి, సార్వభౌమత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం అందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి కౌన్సిలర్ పంజాల మనోజ్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### జాతీయ వాగ్దేవి

# విశేష ప్రతిభా పురస్కారం



చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డి పేట ఆగస్టు 12 : ఇటీవల భాషా సాహిత్యంలో కృషి చేసినందుకుగాను జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం అందుకున్న డా.వాసరవేణి పర్శరాములును తెలంగాణ వివేక రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 12 బుధవారం సాయంత్రం ఎల్లారెడ్డిపేటలో శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వివేక రచయితల సంఘం జిల్లా కార్యదర్శి దుంపెన రమేశ్ మాట్లాడుతూ వాసరవేణి పర్శరాములుగారు ఢిల్లీలో పురస్కారం అందుకున్నందుకు గర్వకారణం అని, ఇంకా భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని ఆత్మీయులుగా సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెవిరసం జిల్లా కార్యదర్శి దుంపెన రమేష్, బండారి బాల్ రెడ్డి, కానాపురం లక్ష్మన్, రొడ్డ రామచంద్రం, మద్దుల బుగ్గారెడ్డి, నేవూరి శ్రీనివాస్ రెడ్డి, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 12 :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా యాత్రలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరావేయాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కొమ్ముల రాజ్ పాల్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగ తిరంగా బైక్ ర్యాలీని దేశభక్తి నినాదాలు చేస్తూ జరిపారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశభక్తిని చాటేలా జాతీయ జెండాను ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి గొప్పగా దేశభక్తిని చాటాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేడిపల్లుల రవి,కిసాన్ మోర్చ మండలాధ్యక్షుడు కాటిపల్లి సురేష్ రెడ్డి,బీజేవైఎం అధ్యక్షులు చిలువేరి మల్లేష్,ఓబీసీ మోర్చాధ్యక్షులు రవీందర్, సర్పంచ్ హేమవత్ రాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి పనుల పురోగతి పరిశీలన

**చురకలు ప్రతినిధి, కోరుట్ల, ఆగస్టు 12 :** కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో వీబీజీ రామ్ జీ పథకం కింద చేపట్టిన జలసిరి పనుల పురోగతిని బుధవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న జలసిరి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల ప్రస్తుత స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, రైతులకు ప్రయోజనం చేకూరేలా జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# హుజురాబాద్‌లో కార్డన్ సెర్చ్



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ ఆగస్టు 12 :** హుజురాబాద్ పట్టణంలోని పలు వీధుల్లో బుధవారం స్థానిక ఏసిపి వాసంశెట్టి మాధవి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాల గురించి ఆరా తీశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతి వీధిలో ఔత్సాహికులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ నరేందర్ తో పాటు ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మల్యాలలో

# వైభవంగా హర్‌ఘర్ తిరంగా యాత్ర



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 12 :** దేశభక్తి భావాన్ని చాటుతూ బీజేపీ మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో మల్యాల మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర, భారీ బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్లాక్ చౌరస్తా వద్ద ప్రారంభమైన తిరంగా పాదయాత్ర అంగడి బజార్ వరకు కొనసాగింది. అనంతరం బ్లాక్ చౌరస్తా నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో మల్యాల వీధులను హోరెత్తించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ మన జెండా మన గౌరవం. ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి, ప్రతి హృదయంలో దేశభక్తి భావనను పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' యాత్ర ముఖ్య ఉద్దేశం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణు, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, గుజ్జ శ్రీనివాస్, వన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మరి మహేష్ రెడ్డి, సర్పంచులు బొట్ల జయప్రసాద్, సంకుర్తి తిరుపతి, గడ్డం నడి మల్లేశం, చీకట్లో లత, వక్కలభరణ మౌర్య, మండల ప్రధాన కార్యదర్శులు పొన్నం సాయికుమార్, పిల్లి రాజశేఖర్, బీజవై మండల అధ్యక్షుడు గౌతమ్, కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు సామ మైపాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పరమేష్, ఉప సర్పంచులు మల్లేశం యాదవ్, వినోద్, శంకర్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, వివిధ రంగాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.